



జై జగన్నాథ



- వైభవంగా రథయాత్ర
- భారీగా తరలివచ్చిన భక్తులు

శ్రీకాకుళం కల్చరల్, జూలై 7: జిల్లాలో జగన్నాథస్వామి రథయాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, జలుమూరు, సోంపేట తదితర మండలాల్లో జగన్నాథ, సుభద్ర, బలభద్రలను రథంపై ఊరేగించారు. జై జగన్నాథ అంటూ స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. మహిళలు కోలాటం, కృష్ణ భక్తులు భజన, తదితర సాంస్కృతి ప్రదర్శనలు అలరించాయి. సోమవారం నుంచి పది రోజుల పాటు స్వామివారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనం ఇస్తారని నిర్వాహకులు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని గుజరాతీపేటలో ఉన్న అతి పురాతనమైన జగన్నాథస్వామి ఆలయంలో పెంట వంశీయులు శ్రీనివాస్ శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో రథయాత్రను నిర్వహించారు. అదేవిధంగా బొందిలీపురంలో కూడా రథయాత్ర జరిగింది. ఉదయం నుంచే జగన్నాథస్వామిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు.


ప్రత్యేక అలంకరణలో జగన్నాథుడు, సుభద్ర, బలభద్ర

గుజరాతీపేటలో హారతి అందుకుంటున్న భక్తులు


జలుమూరు: రథం లాగుతున్న మహిళలు


సోంపేట: రథయాత్రలో భక్తజనం


బొందిలీపురంలో రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం


ఇచ్ఛాపురం: స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు


ఇచ్ఛాపురం: పూజలందుకుంటున్న జగన్నాథుడు

నేటి నుంచి ఇసుక ఉచితం

- టన్ను రూ.340 మాత్రమే
- పేదలకు తీరనున్న కష్టాలు
- నిర్మాణ రంగానికి ఊతం
- అక్రమాలపై ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నెంబర్లు ఏర్పాటు



(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ప్రజలకు ఇసుక కష్టాలు తీరనున్నాయి. సోమవారం నుంచి ఉచితంగా పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జిల్లాలో ఉన్న ఆరు రీచ్‌ల్లో తవ్వకాలు చేపట్టనున్నారు. కొత్తగా మరో ఆరు రీచ్‌లను అధికారులు గుర్తించారు. త్వరలో ఇక్కడ కూడా ఇసుక తవ్వకాలు చేపట్టి ప్రజలకు అందించనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణ రంగం తీవ్రంగా కుదేలైంది. జగన్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెండేళ్ల పాటు కనీసం ఇసుకను కూడా అందుబాటులో లేకుండా చేసేశారు. ఆ తర్వాత వైసీపీ నాయకులే బకాసురుల మాదిరిగా ఇసుక రీచ్‌లను పంచేసుకుని ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి దోచుకున్నారు. పేరుకే ఓ సంస్థ నిర్వహణ బాధ్యతలు చూసినప్పటికీ వైసీపీ నాయకులే ఇసుక దందాకు పాల్పడేవారు. దీంతో సామాన్యులకు ఇసుక అందని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ప్రజలకు ఇసుక కష్టాలు తొలుగుతున్నాయి. ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచే అమల్లోకి రానుంది. ఈ మేరకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది.

టన్ను రూ.340

గత ప్రభుత్వ హయాంలో ఒక్కో డిపో నుంచి ఒక్కో విధంగా ఇసుక తరలింపునకు సంబంధించి రేట్లు ఉండేవి. ఉదాహరణకు టెక్కలి డిపో నుంచి టన్ను రూ.808 వసూలు చేసేవారు. ఇది పేరుకే అయినా.. వేల రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు కొత్త విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాలో ఎక్కడ నుంచైనా.. ఎంతవరకైనా ఒక మెట్రిక్ టన్నుకు కేవలం నిర్దిష్ట ధర రూ.340 మాత్రమే చెల్లించాలి. అంతకుమించి ఎటువంటి అదనపు రుసుం చెల్లించవసరంలేదు. ప్రస్తుతం జిల్లాలో రెండు డిపోల్లో మాత్రమే ఇసుక నిల్వ ఉంది. టెక్కలి డిపోలో 10వేల టన్నులు, అంగూరు డిపోలో 52 వేల టన్నులు మొత్తం 62వేల టన్నులు ఇసుక అందుబాటులో ఉంది. ఈ ఇసుకను మాత్రమే సోమవారం నుంచి అవసరమున్న వారికి పంపిణీ చేస్తారు. ఇదివరకు జేపీ సంస్థ అని, ఆతర్వాత మరో సంస్థకు వైసీపీ ప్రభుత్వం అప్పగించేసింది. అవన్నీ స్వాధీనం చేసుకుంటున్నారు అధికారులు.

రెవెన్యూ, పోలీసుశాఖలదే పర్యవేక్షణ..

ఇసుక డిపోలు, రీచ్‌ల వద్ద అక్రమాలు జరగకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యతను రెవెన్యూ, పోలీసు అధికారులకే ప్రభుత్వం అప్పగించింది వీఆర్వో, భూగర్భ గనుల శాఖ టెక్నికల్ అసిస్టెంట్, పోలీసు కానిస్టేబుల్ విధులు నిర్వహించాలి. తహసీల్దార్లు పర్యవేక్షించాలి. ఇసుక తరలింపు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే చేపట్టాలి. తరువాత తవ్వకాలు చేపట్టరాదు. దీనివల్ల రాత్రిళ్ల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వీలుంటుంది. ఇసుక తరలింపు పాయింట్ల వద్ద విద్యుత్ సదుపాయం, సీసీ కెమెరాలు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తారు. అలాగే నగదు చెల్లింపులు కూడా కేవలం క్యూఆర్ కోడ్ లేదా యూపీఐ యాప్‌ల ద్వారా చేపట్టాల్సిందే. ఇసుక తీసుకున్న వినియోగదారులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాల్సిందే. తొలి ప్రాధాన్యం ట్రాక్టర్లకు ఉంటుంది. తరువాతే ఆరు టైర్ల లారీలకు లోడింగ్‌కు అనుమతి ఇస్తారు. ముందుగా గృహ నిర్మాణాలకు, తర్వాత బిల్డర్లకు ఇసుక సరఫరా చేస్తారు.

కొత్తగా మరో ఆరు రీచ్‌లు..

జిల్లాలో వంశధార, నాగావళి నదుల పరిధిలోని అంబళ్ల వలస, నివగాం, బూరవెల్లి, గోపాలపెంట, హయతీనగరం, బట్టేరు వద్ద ఇదివరకే రీచ్‌లను గుర్తించారు. అలాగే కొత్తగా మరో ఆరు రీచ్‌లను అధికారులను గుర్తించారు. వీటికి కాలుష్య నియంత్రణా మండలి నుంచి కూడా అనుమతి లభించింది. త్వరలో కొత్తరీచ్‌ల్లో కూడా తవ్వకాలు జరగనున్నాయి. ఏమైనా అక్రమాలు జరిగితే ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-6012కు, ల్యాండ్‌లైన్ నెంబర్ 08942-293229కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చు. అలాగే వాట్సాప్ (9701691657) ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు.


పాఠశాల సిబ్బంది, విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జయప్రకాష్

పాఠశాల పరిసరాలు ఇలాగేనా ఉండేది?

- కోటబొమ్మాళి కేజీబీవీ సిబ్బందిపై అధికారుల ఆగ్రహం

టెక్కలి, జూలై 7: కోటబొమ్మాళి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ సిబ్బందిపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు అధ్వానంగా ఉండడంపై మండిపడ్డారు. పాఠశాలను ఇలాగేనా ఉంచుతారా? అని ప్రశ్నించారు. శనివారం మధ్యాహ్నం 20 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వీరంతా కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఉదయం ఈ పాఠశాలను పలువురు అధికారులు సందర్శించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్నతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వసతిగృహ పరిసరాలు, వంటచేసే ప్రాంతాలు పరిశుభ్రంగా లేకపోవడంపై సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఆర్.జయప్రకాష్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే డీఎంహెచ్‌వో డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జయప్రకాష్ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. అస్వస్థతకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కలుషిత నీరే కారణమని కొందరు విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్ కోటబొమ్మాళి సీహెచ్‌సీకి వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. చికిత్స పొందుతున్న విద్యార్థినుల్లో జి.మాధవి మినహా మిగిలిన వారంతా ఆదివారం సాయంత్రం డిశ్చార్జి అయ్యారు.


టెక్కలి: మదనగోపాలసాగరం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తాం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

టెక్కలి/పలాసరూరల్, జూలై 7: వంశధార ప్రధాన ఎడమ కాలువ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఆదివారం సాయంత్రం టెక్కలి సమీపంలో 55.765 కిలోమీటరు వద్ద జోగిపాడు రెగ్యులేటర్‌ను పరిశీలించారు. కాలువల్లో పూడికతీత పనులపై ఆరాతీశారు. ప్రస్తుతం కాలువలో ఎన్ని క్యూసెక్కుల నీరు వస్తుందని సంబంధిత అధికారులను అడగగా 560 క్యూసెక్కుల వస్తుందని తెలిపారు. ప్రస్తుతం గొట్టాబ్యారేజ్‌లో 38.10 మీటర్లు రిజర్వాయర్ లెవల్ మెంటైన్ చేస్తున్నట్లు వారు చెప్పారు. పలాస సమీపంలోని జగన్నాథసాగరం నిండిన తరువాత శివారు ప్రాంతమైన వజ్రపుకొత్తూరు మండలం కొత్తచెరువు వరకు సాగునీరు అందిస్తామన్నారు. అలాగే టెక్కలి సమీపంలోని మదనగోపాలసాగరం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను వంశధార అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ రిజర్వాయర్‌లో 0.12 టీఎంసీ సాగునీరు నిల్వ ఉంటుందని వంశధార ఈఈ బి.శేఖరరావు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాలువల పరిశీలనకు గట్లు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని, గ్రావెల్ మార్గాలు వేసుకునేందుకు అవకాశాలు కల్పించాలని ఈఈ కోరారు. అవసరమైన నిధులు మంజూరుకు కలెక్టర్ హామీ ఇచ్చారు. వంశధార ఎస్ఈ రాంబాబు, డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆఫ్‌షోర్'లో సాంకేతిక లోపాలను అధిగమించాలి..

పలాస రూరల్: ఆఫ్‌షోర్ రిజర్వాయరులో సాంకేతిక లోపాలను అధిగమించి పనులు చేపట్టేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. మండలంలోని రేగులపాడు వద్ద ఉన్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను, టెక్కలిపట్నం వంశధార ఎడమ కాలువను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆఫ్‌షోర్ డిజైనింగ్ మ్యాప్‌ను పరిశీలించి సాంకేతిక లోపాలు ఏమి ఉన్నాయి, వాటిని ఎలా అధిగమించాలి, పెండింగ్ పనులు ఎంతవరకు వచ్చాయి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో భరత్ నాయక్, ఆఫ్‌షోర్ అధికారులు, టీడీపీ నాయకులు వజ్జబాబూరావు, లొడగల కామేశ్వరరావు, జనసేన నియోజక వర్గ సమన్వయకర్త దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాతో ఆశ్రమ విద్యార్థిని మృతి

- రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మరో నలుగురు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- సిబ్బంది నిర్లక్ష్యంపై డీఎంహెచ్‌వో ఆగ్రహం

సరుబుజ్జిలి, జూలై 7: మండలంలోని వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న బిడ్డిక రిస్మిత (8) మలేరియా జ్వరంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. మరో నలుగురు విద్యార్థినులు ఇదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం అచ్చెబ గ్రామానికి చెందిన రిస్మిత మూడో తరగతిలో కొత్తగా చేరింది. ఇటీవల ఇంటికి వెళ్లి పాఠశాలకు వచ్చిన రిస్మితతో పాటు ఆరో తరగతి చదువుతున్న సవర ప్రభావతికి కూడా ఈ నెల 5న తీవ్ర జ్వరం వచ్చింది. దీంతో సిబ్బంది వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. వైద్య సిబ్బంది రక్తనమూనాలు సేకరించారు. మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యాధికారి సంతోష్‌కుమార్ సకాలంలో స్పందించి బాలికలను మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రిస్మిత మృతి చెందింది. ప్రభావతికి చికిత్స అందిస్తున్నారు. ఈ పాఠశాలలో చదువుతున్న 250 మంది విద్యార్థినులకు ఆదివారం రక్త పరీక్షలు చేశారు. వీరిలో ఆరో తరగతి విద్యార్థినులు సవర స్వప్న, కొండగొర్రె రిబి, సవర అంజలికి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యులు వెంటనే రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. పిల్లలు జ్వరాల బారినపడుతుండడంతో తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.


రిస్మిత (ఫైల్)


జ్వర పీడితులను ఆటోలో రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం

డీఎంహెచ్‌వో ఆగ్రహం..

గిరిజన బాలిక రిస్మిత మృతితో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి ఆదివారం ఉదయం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో హెచ్‌ఎం, వార్డెన్, అధ్యాపకులు విధులకు హాజరుకాలేదు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వహించిన హెచ్‌ఎం, వార్డెన్, ఏఎన్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికలు అల్పాహారం మాత్రమే తీసుకున్నారు. అనంతరం విధులకు హాజరైన సిబ్బందిని ప్రశ్నించారు. పిల్లల అల్పాహారం సమయంలో కూడా లేకపోవడం మీ బాధ్యతరాహిత్యానికి నిదర్శనమన్నా రు. రాత్రివేళల్లో పూర్తిగా రక్షణ కొరవడినట్టు తెలుస్తుందన్నారు. పాఠశాల ఆవరణలో పారిశుధ్య లోపంపై ఆగ్రహించారు. పిల్లలు ప్లేట్లు, చేతులను శుభ్రం చేసుకొనే ప్రదేశంలో వ్యర్థాలను డ్రమ్ముల్లో నిల్వ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. పిల్లలందరికీ వేడినీరు అందించాలని ఆదేశించారు. రిస్మిత మృతిపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తానని తెలిపారు. ఆమె వెంట జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, స్థానిక వైద్యులు సంతోష్‌కుమార్, సాహితీ, ప్రియ దర్శిని ఉన్నారు.


ఆశ్రమ పాఠశాల సిబ్బందిని ప్రశ్నిస్తున్న డీఎంహెచ్‌వో

బీఆర్‌ఏయూలో డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష రేపు

ఎచ్చెర్ల, జూలై 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ కేంద్రంగా ఈ నెల 9న (మంగళవారం) డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలలకు సంబంధించి ఐదో సెమిస్టర్‌లో ఒక్క సబ్జెక్ట్ తప్పిపోయిన విద్యార్థుల కోసం ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒక్క సబ్జెక్టు ఫెయిలైన వారిలో 256 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరిలో 236 మంది పరీక్ష ఫీజు చెల్లించారు. ఇంకా ఫీజు చెల్లించని 20 మంది విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి 2 గంటల ముందు ఫీజు చెల్లించే అవకాశం ఉందని తెలిపారు.

ఎంసీఏ సెమిస్టర్ ఫలితాలు విడుదల..

అంబేడ్కర్ యూనివర్సిటీ ఎంసీఏ విద్యార్థుల మూడో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. ఈ పరీక్షకు 37 మంది హాజరు కాగా, 36 మంది ఉత్తీర్ణులైనట్లు డీన్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ఈ వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

10న జాబ్‌మేళా..

ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 10న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐలో వివిధ ట్రేడుల్లో ఉత్తీర్ణులై 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు గల వారు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు బయోడేటా, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15వేల నుంచి రూ.18వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు.

ఆదిత్యుని ఆదాయం రూ.5.58 లక్షలు

అరసవల్లి, జూలై 7: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.5,58,028 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.2.80 లక్షలు, విరాళాల రూపంలో రూ.69,813, ప్రసాదాల ద్వారా రూ.2,27,415 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

దిక్సూచి DIKSUCHI

జాతీయ అత్యవసర పరిస్థితి (1975) ఒక సమగ్ర అవగాహన

ఇటీవల 18వ లోక్‌సభ కొలువుతీరిన తొలి రోజున భారతదేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధించి 49 ఏళ్లు కావస్తున్న సందర్భంగా ప్రధాని ఆనాటి దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడిన యోధులకు నివాళి అర్పించారు. అదేవిధంగా స్పీకర్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెడుతూ 1975 నాటి అత్యవసర పరిస్థితి కాలాన్ని భారతదేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా వర్ణించారు. సభలో ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ వాయిదా పడింది. ఈ సంఘటన 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితిపై దేశప్రజలందరూ దృష్టిసారించేలా చేసింది. ఈ నేపథ్యంలో 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితి విధింపునకు కారణాలు, ఎమర్జెన్సీ కాలపు నిరంకుశ పద్ధతులు, రాజ్యాంగ సవరణలు, తదనంతర కాలంలో తీసుకొచ్చిన రాజ్యాంగ మార్పులు తదితర అంశాలపై అవగాహన ఆవశ్యకం.

భారత రాజ్యాంగంలో అత్యవసర పరిస్థితి నిబంధనల చేర్పు

ఏవైనా అంతర్గత లేదా బాహ్య కారణాలు లేదంటే ఆర్థిక పరిస్థితుల కారణంగా దేశ భద్రత, ఐక్యత, సమగ్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉంటే ఆ పరిస్థితులనే అత్యవసర పరిస్థితులుగా పరిగణిస్తారు. వీటిని ఎదుర్కొనడానికి, దేశాన్ని ఏకతాటిపై ఉంచడానికి కేంద్రానికి ప్రత్యేక అధికారాలు అవసరమని, ఆ అధికారాలను రాజ్యాంగ నిబంధనల పరంగా అందించాలని డా.బీ.ఆర్. అంబేద్కర్, టీ.టీ.కృష్ణమాచారి, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ వంటి న్యాయ కోవిదులు రాజ్యాంగ రచన సమయంలో భావించారు. ఈ అధికారాల నిరంకుశత్వాన్ని గ్రహించిన ప్రొ.కె.టి. షా, పీ.డీ.దేశ్‌ముఖ్, హెచ్.వీ.కామత్ వంటివారు వ్యతిరేకించడంతో వీటిని ప్రయోగించాల్సిన పరిస్థితులు పెద్దగా రాకపోవచ్చని, అన్యదా అవసరాల కోసమే వీటిని క్రోడీకరిస్తున్నామని వీటిని మృతాక్షరాలుగా పేర్కొనవచ్చని రాజ్యాంగ పరిషత్ చర్చల్లో అంబేద్కర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ 1975 నుంచి 1977 మధ్యకాలంలో 21 నెలలు దేశం చూసిన చీకటి రోజులు అంబేద్కర్ ఆకాంక్షకు గండికొట్టాయి.

> అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీ దళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

భారతదేశంలో 1975 నాటి అత్యవసర పరిస్థితి-పరిణామాలు

1971లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజక వర్గం నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఎన్నికల సమయంలో ఆమె ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951ని ఉల్లంఘించారని, నిబంధనలకు వ్యతిరేకంగా తన ప్రచార కార్యక్రమాలకు ప్రభుత్వ వనరులను పెద్ద ఎత్తున వినియోగించారు కాబట్టి ఇందిర ఎన్నిక చెల్లదని ఆమె ప్రత్యర్థి రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(7) ప్రకారం ఇందిరాగాంధీ చర్యలను చట్ట ఉల్లంఘనగా పేర్కొంటూ, ఎన్నిక చెల్లదని స్పష్టం చేసింది. అలాగే ప్రధానిగా కొనసాగరాదని, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆరేళ్లు నిషేధం వర్తిస్తుందని తీర్పు చెప్పింది.

ఈ తీర్పును సవాల్ చేస్తూ ఇందిరాగాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 1975 జూన్ 24న సుప్రీంకోర్టు ఇందిరాగాంధీ ప్రధానిగా కొనసాగవచ్చని అయితే ఆమె పార్లమెంట్‌లో జరిగే ఏ ఓటింగ్‌లోనూ పాల్గొనరాదని, ఎంపీగా ఆమెకు లభిస్తున్న అన్ని సదుపాయాలను నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.



అప్పటికే దేశంలో అనేక ప్రాంతాల్లో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల్లో అవినీతి; నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక సంక్షోభాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అశాంతి మొదలైంది. 1979లో గుజరాత్‌లో 'నవ నిర్మాణ్ ఆందోళన్', బిహార్‌లో జయప్రకాష్ నారాయణ్ ఉద్యమం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, మధ్యతరగతి ప్రజలు భారీగా ఈ ఉద్యమాల్లో పాల్గొన్నారు. దేశంలోని అన్ని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు మద్దతునిచ్చాయి. నవ నిర్మాణ్ ఉద్యమం కారణంగా గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయింది. జార్జి ఫెర్నాండెజ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున రైల్వే సమ్మె నిర్వహించారు. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హై కోర్టు తీర్పునివ్వడం ఈ పరిస్థితులకు ఆజ్యం పోసింది. ఇందిరాగాంధీ రాజీనామా కోసం విపక్షాలు పట్టుబట్టాయి.

సుప్రీంకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొంది ప్రధానిగా కొనసాగే అనుమతిని ఆమె తెచ్చుకోవడంతో తరవాతి రోజు 1975 జూన్ 25న ప్రతిపక్ష పార్టీలు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. పోరాటం తీవ్రం చేసేందుకు నిర్ణయించాయి. ఇటువంటి అననుకూల పరిస్థితుల్లో 1975 జూన్ 25 అర్థరాత్రి జాతీయ అత్యవసర పరిస్థితి విధించారు. మంత్రిమండలిని సంప్రదించకుండానే రాష్ట్రపతికి అత్యవసర పరిస్థితి విధించాల్సిందిగా ఇందిరాగాంధీ సిఫార్సు చేశారు. ప్రతిపక్షాలను అణచివేసి తాను పదవిలో కొనసాగేందుకే రాజ్యాంగ ప్రకరణ 352లో ఉన్న 'అంతర్గత కల్లోలం' అనే పదాన్ని వక్రీకరించి అత్యవసర పరిస్థితి విధించారనే అపకీర్తిని ఇందిర మూటగట్టుకున్నారు. ఈ అత్యవసర పరిస్థితి కాలంలో ఆచరించిన అనేక నిరంకుశ విధానాలు కూడా తీవ్ర విమర్శలకు గురయ్యాయి.

1975 అత్యవసర పరిస్థితి కాలం నాటి వివిధ పరిణామాలు

అత్యవసర పరిస్థితి విధించిన కొన్ని గంటల్లోనే అనేక రాజకీయ పార్టీల నాయకులు అరెస్ట్ అయ్యారు. విజయ రాజే సింధియా, జయప్రకాష్ నారాయణ, ములాయం సింగ్ యాదవ్, మొరార్జీ దేశాయ్, చరణ్ సింగ్, జార్జ్ ఫెర్నాండెజ్, అటల్ బిహారీ వాజపేయి, జ్యోతిబసు, అద్వానీ, అరుణ్ జైట్లీ వంటి పలువురు ప్రముఖులు వీరిలో ఉన్నారు. వీరందరూ ప్రధానంగా 'మీసా'(ఎంఐఎస్‌ఏ- మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్), డీఐఎస్‌ఐఆర్(డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్ట్ అండ్ డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్), సీఓఎఫ్‌ఈపీఓఎస్‌ఏ(కన్జర్వేషన్ ఆఫ్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ స్మగ్లింగ్ యాక్టివిటీస్ యాక్ట్) వంటి కఠిన చట్టాల కింద అరెస్టయ్యారు. జమాతే ఇస్లామీ, ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలపై నిషేధం విధించారు.

అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీ దళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

దిశలు - దూరాలు


రీజనింగ్



ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-2

ముఖ్య రేఖాచిత్రం




నోట్: ఈ చాప్టర్‌కు సంబంధించి అడిగే ప్రశ్నలకు పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకోవాలి. పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకొంటే మిడిల్ పాయింట్‌కు కుడివైపు అంటే తూర్పు, ఎడమవైపు అంటే పడమర, పై వైపు అంటే ఉత్తరం, కిందవైపు అంటే దక్షిణానికి అని అర్థం.

1. వినయ్ 40మీ. పడమరకు నడిచిన తరవాత దక్షిణం వైపునకు తిరిగి 30మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు 25మీ. నడిచిన తరవాత ఉత్తరానికి తిరిగి 20మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు తిరిగి 15 మీ॥ నడిచాడు. అయితే ఇప్పుడు వినయ్ బయలుదేరిన స్థానం నుంచి ఎంతదూరంలో ఏ దిశలో ఉన్నాడు?

ఎ) ఉత్తరం 10 మీ. బి) దక్షిణం 10 మీ.
సి) తూర్పు 10 మీ. డి) పడమర 10 మీ.

సమాధానం: (బి)

వివరణ:



పై రేఖాచిత్రంలో బయలుదేరిన స్థానం (L)నకు, చేరుకున్న స్థానం (M) కిందకు ఉంది.

ముఖ్యరేఖాచిత్రం(మెయిన్ డయాగ్రమ్)ను పరిశీలిస్తే మిడిల్ పాయింట్ నుంచి కిందకు అంటే దక్షిణం అని చెప్పారు. అంతేకాక పై రేఖాచిత్రాన్ని బట్టి వినయ్ బయలుదేరిన స్థానం నుంచి 10 మీ. దూరంలో ఉన్నాడని తెలుస్తుంది. సమాధానం దక్షిణం 10 మీ.

షార్ట్‌కట్: ముందుగా ప్రశ్నలో ఇచ్చిన సమాచారాన్ని రాసుకోవాలి. అది ఏమంటే పడమర 40, దక్షిణం 30, తూర్పు 25, ఉత్తరం 20, తూర్పు 15. తరవాత ఒకే దిశకు సంబంధించినవి రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు ఉంటే కూడాలి. పై సమాచారంలో తూర్పు 25, తూర్పు 15 లను కూడితే తూర్పు 40 అవుతుంది. ఇప్పుడు పై సమాచారం కింది విధంగా ఉంటుంది.

పడమర$_{40}$, దక్షిణం$_{30}$, తూర్పు$_{40}$, ఉత్తరం$_{20}$.


ఇప్పుడు వ్యతిరేక దిశల విలువ సమానంగా ఉంటే అది క్యాన్సిల్. పై సమాచారంలో పడమర $_{40}$, తూర్పు $_{40}$లు క్యాన్సిల్ అవుతాయి. మిగిలిన రెండింటిలో ఏది ఎక్కువ, ఎంత ఎక్కువ అదే సమాధానం అవుతుంది. తూర్పు$_{40}$, పడమర$_{40}$ క్యాన్సిల్ అవగా మిగిలిన దక్షిణం$_{30}$, ఉత్తరం$_{20}$ లలో దక్షిణం$_{10}$ ఎక్కువ ఉంది అదే సమాధానం అవుతుంది.

2. వినోద్ 5మీ. ఉత్తరానికి నడిచిన తరవాత కుడివైపునకు తిరిగి 6మీ. నడిచాడు. తదుపరి మరల ఎడమవైపునకు తిరిగి 3 మీ. నడిచాడు. అయితే ఇప్పుడు వినోద్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఉన్నాడు?

ఎ) 10 మీ. బి) 14 మీ. సి) 12 మీ. డి) 18 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:



D- బయలుదేరిన స్థానం, E- చేరుకున్న స్థానం.

DF- ఒక భుజము 6 మీ॥. EF- మరో భుజము 8 మీ॥ (5 + 3)

DE- కర్ణము

పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం కర్ణము^{2} = భుజము^{2} +భుజము^{2}

కర్ణము^{2} = $6^2 + 8^2$

కర్ణము^{2} = $36 + 64$

కర్ణము^{2} = 100

కర్ణము = $\sqrt{100}$ = 10మీ॥

వినోద్ బయలుదేరిన స్థానం (D)కు చేరుకున్న స్థానం (E) 10 మీ. దూరంలో ఉంది.

3. A, B, C, D అనే నలుగురు బల్లకు నాలుగు వైపుల కూర్చొని క్యారమ్స్ ఆడుతున్నారు. B, D భాగస్వాములు. A ఉత్తరానికి ముఖభాగం కలిగి ఉన్నాడు. D తూర్పునకు ముఖభాగం కలిగి ఉన్నాడు. అయితే దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి ఎవరు?

ఎ) B బి) C సి) చెప్పలేం డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: A, B, C, D నలుగురు నాలుగువైపులా కూర్చుంటారు. ఎదురెదురు వ్యక్తులు భాగస్వాములౌతారు. B, D భాగస్వాములని చెప్పారు. కాబట్టి A, C మరొక భాగస్వాములు అవుతారు. A ఉత్తరానికి ముఖభాగం కలిగి ఉన్నాడని ప్రశ్నలో చెప్పారు. A, Cలు భాగస్వాములు కనుక దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి 'C' అవుతారు.

సమాధానం: సి



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

ఆర్‌డబ్ల్యూఎస్‌లో అడ్డగోలుతనం

- వైసీపీ హయాంలో పదోన్నతుల్లో ఇష్టారాజ్యం
- వీరభక్త అధికారులకు వరుస పదోన్నతులు
- ఓ డీఈఈ కేడర్ అనతికాలంలో సీఈగా..
- సుప్రీం, హైకోర్టు మార్గదర్శకాలు బేఖాతర్
- ఐదేళ్లూ భయంతో నోరెత్తని బాధిత ఉద్యోగులు
- కూటమి ప్రభుత్వం రావడంతో ఫిర్యాదులు
- వైసీపీ అస్మదీయ అధికారుల భారీ అవినీతి
- భారీ విల్లాలు, బహుళ అంతస్థుల భవనాలపై విచారణ జరిపించాలని కాంట్రాక్టర్ల వినతి
- డిప్యూటీ సీఎం పవన్‌కు ఫిర్యాదుల వెల్లువ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా పదోన్నతులు కల్పించారు. సీనియారిటీని తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా కొందరు అధికారులకు ప్రమోషన్ ఇచ్చారు. వైసీపీకి వీరవిధేయులుగా ఉన్న వారికి నాటి ప్రభుత్వ పెద్దల సిఫార్సులతో అతి తక్కువ కాలంలోనే పదోన్నతుల మీద పదోన్నతులు కల్పించారు. సంస్థను అవినీతి మేతగా మార్చేశారు. పదోన్నతుల విషయంలో అన్యాయం జరుగుతున్నా అప్పట్లో ఏ ఒక్క అధికారి కూడా ఎదిరించలేకపోయారు. బాధిత అధికారులు కోర్టును ఆశ్రయించినా ఖాతరు చేయకుండా అయినవాళ్లకు అడ్డగోలుగా పోస్టుల సంతర్పణ చేశారు. ఐదేళ్లు మౌన వేదన అనుభవించిన అధికారులు కూటమి ప్రభుత్వం రావటంతో జరిగిన అన్యాయాలపై గొంతెత్తుతున్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ పెద్దల అండదండలతో తమకు తీరని అన్యాయం చేసిన వైసీపీ వీరవిధేయ అధికారులపై తాజాగా డిప్యూటీ సీఎం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు బాధిత అధికారులు ఫిర్యాదులు చేశారు. పలువురు కాంట్రాక్టర్లు కూడా అవినీతి అధికారులపై విచారణకు ఆదేశించాలని ఫిర్యాదులు చేశారు. దీన్నిబట్టి గ్రామీణ నీటి సరఫరా విభాగాన్ని వైసీపీ పెద్దలు అవినీతి మేతతో ఎంతగా నిర్వీర్యం చేశారో, వ్యవస్థను ఎంత భ్రష్టుపట్టించారో అర్థమవుతుంది.

వైసీపీ పెద్దల సిఫారసుతో...

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అందిన ఫిర్యాదుల మేరకు.. విజయవాడ గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ పోస్టును సీనియారిటీ జాబితాలో లేని వ్యక్తికి నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టారు. ఈఎన్‌సీ కార్యాలయంలో నాలుగు చీఫ్ ఇంజనీర్ (సీఈ) పోస్టులు ఉన్నాయి. ఈఎన్‌సీతో పాటు మరో మూడు సీఈ పోస్టులు ఉన్నాయి. అదనపు సీఈ పోస్టు అవసరం లేదు. కానీ డ్రింకింగ్ వాటర్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఒక డీఈకి చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా పదోన్నతి ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవానికి చీఫ్ ఇంజనీర్ల (సీఈ) పోస్టులకు రోస్టర్ లేదు. ఈఎన్‌సీతో కలిపి నలుగురు చీఫ్ ఇంజనీర్లు ఉండగా.. దొడ్డిదారిన ఐదో చీఫ్ ఇంజనీర్‌గా వైసీపీ ప్రభుత్వ పెద్దలు సిఫార్సు చేసిన డీఈఈని తెరమీదకు తీసుకువచ్చారు. ఆ వ్యక్తి డీఈ కేడర్ అయినా వైసీపీ పెద్దలతో తనకున్న పలుకుబడితో ఇన్‌చార్జి ఈఈ, ఎస్ఈ, సీఈలుగా పలు సందర్భాలలో పని చేశారు. ఆయన కంటే ఎక్కువ సీనియారిటీ గల వారు చాలామంది ఉన్నా.. వారందరిని పక్కన పెట్టి మరీ పదోన్నతి కల్పించారు. ఆయనను రిజర్వేషన్ల ప్రాతిపదికన నియమించినట్టు వైసీపీ వీరవిధేయ ఉన్నతాధికారులు వాదించారు. రిజర్వేషన్ల ప్రాతిపదికనే ఆయనకు పదోన్నతి కల్పిస్తే, అదే రిజర్వేషన్ల ప్రకారం సీనియారిటీ ఉన్న పలువురు అధికారులకు న్యాయం చేయాలి కదా? వారికెందుకు న్యాయం చేయలేదన్నది ఇక్కడ ప్రశ్న. రిజర్వేషన్ల ప్రాతిపదికనే ఆ డీఈఈకి పదోన్నతి కల్పించారనుకుంటే.. ఆ దామాషా ప్రకారం ఇప్పటికే పదోన్నతులు కల్పించారు. రిజర్వేషన్ల దామాషా పూర్తయితే ఆ పేరుతో అదనపు పదోన్నతులు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు గతంలో జర్నయిల్ సింగ్ అనే వ్యక్తి వేసిన కేసులో నిర్దేశించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆ వీరభక్త అధికారికి నిబంధనలకు విరుద్ధంగా ఈఎన్‌సీ పదోన్నతి అందుకునేలా సీనియారిటీని కూడా కల్పిస్తూ ఆదేశాలు ఇచ్చారు. డీఈఈకి అతి తక్కువ సమయంలో ఈఈ, ఎస్ఈ, సీఈగా పదోన్నతులు కల్పించారు. ఈఎన్‌సీగా పదోన్నతిగా పొందేందుకు కూడా లైన్ క్లియర్ చేశారు. ఓ అధికారికి ఇలా సీనియారిటీ కల్పించటం ఎక్కడైనా ఉంటుందా? ఎంత రిజర్వేషన్లు చూసుకున్నా ఇలాంటి విధానం ఎక్కడైనా ఉంటుందా? అని బాధిత అధికారులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించిన క్రమంలో ఎస్సీ, ఎస్టీ పదోన్నతులకు సంబంధించి సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిందిగా నిర్దేశించింది. గత వైసీపీ ప్రభుత్వం తెలివిగా ఈ అంశాన్ని తాత్సారం చేయటం కోసం ఐఏఎస్ అధికారులతో కమిటీని నియమించింది. ఆ కమిటీ ఇప్పటి వరకు ఎలాంటి నివేదికా ఇవ్వలేదు.



తాడేపల్లి సమీప కుంచనపల్లిలో కొనుగోలు చేసిన విల్లా



అనంతపురంలో ఓ భవనం, నిర్మాణంలో ఉన్న మరో భవనం



తెలంగాణలో మొయినాబాద్‌లోని గెస్ట్‌హౌస్

కోర్టు ఆదేశాలు బేఖాతర్

ఆర్‌డబ్ల్యూఎస్‌లో సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవటంతో బీసీ, ఓసీ ఉద్యోగుల సంఘాలు 2020లో హైకోర్టును ఆశ్రయించాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పదోన్నతులు అమలు చేయాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. హైకోర్టు ఆదేశాలను కూడా వైసీపీ ప్రభుత్వం ఖాతర్ చేయలేదు. తమకు అన్యాయం జరుగుతుందన్న ఉద్దేశ్యంతో సీనియారిటీ ఉన్న 20 మంది పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు మళ్లీ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు జారీ చేసిన ప్రతిసారీ అమలు చేస్తున్నట్టుగా ఉత్తర్వులు ఇవ్వటం, ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వటం తప్పితే.. పదోన్నతుల విషయంలో మళ్లీ పాత తంతునే పాటిస్తున్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ జీఓలు, గెజిట్ నోటిఫికేషన్ల ప్రకారం ఆర్అండ్‌బీ వంటి మిగిలిన ఇంజనీరింగ్ విభాగాలలో తమకు అన్వయించుకుని అమలు చేస్తుండగా.. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌లలో మాత్రం అమలు చేయటం లేదు.

అడ్డగోలుగా చెల్లింపులు

వైసీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా తమకు అనుకూలంగా పనిచేసిన ఏఈఈలకు డీఈ, ఈఈ పోస్టులను కట్టబెట్టారని, అడ్డగోలుగా ఎంబుక్‌లను రికార్డు చేయించి బిల్లులు చెల్లింపులకు పాల్పడారని బాధిత అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ను పూర్తిగా అవినీతిమయంగా మార్చేశారని, శాఖను భ్రష్టుపట్టించారని తమకు న్యాయం చేయాల్సిందిగా పవన్ కల్యాణ్‌కు అభ్యర్థించారు.

అవినీతిపై విచారణ జరిపించండి

వైసీపీ ప్రభుత్వ హయాంలో వీరభజన చేస్తూ వారి పాపంలో భాగస్వామ్యం పంచుకున్న అవినీతి అధికారులు ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టుకున్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పలువురు కాంట్రాక్టర్లు ఫిర్యాదులు చేశారు. అవినీతి సొమ్ముతో అక్రమ సౌధాలు నిర్మించుకున్నారని, విల్లాలు, భారీ బహుళ అంతస్థుల భవనాలను కట్టిస్తున్నారని తెలిపారు. వీటిపై సమగ్ర విచారణ జరిపించాల్సిందిగా ఫిర్యాదులో పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ ఆ దిశగా దృష్టి సారిస్తున్నట్టు సమాచారం. ఓ అధికారి భారీగా అవినీతికి పాల్పడ్డారని, పలు ప్రాంతాల్లో బహుళ అంతస్థుల భవనాలు కట్టుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



పెళ్లి.. చాలా కాస్ట్లీ గురూ!

- ఈ ఏడాది అంచనా 10.85 లక్షల కోట్లు
- అమెరికాలో కంటే భారత్‌లో రెట్టింపు వ్యయం

న్యూఢిల్లీ, జూలై 7: ప్రతి మనిషి జీవితంలో ఒకే ఒక్కసారి జరిగే వేడుక పెళ్లి. తల్లిదండ్రులు తమ హోదాకు తగినట్టు ఖర్చుకు వెనుకాడకుండా పిల్లల వివాహాలను వైభవంగా జరిపిస్తారు. పేదలు కూడా అప్పు చేసైనా ఉన్నంతలో చేస్తారు. ధనవంతులైతే కోట్లకు కోట్లు ఖర్చు చేసేస్తారు. మన దేశంలో ఈ మధ్యకాలంలో పెళ్లిళ్ల కోసం చేస్తున్న ఖర్చు బాగా పెరిగిపోతోంది. జెఫరీజ్ గ్రూప్ నివేదిక ప్రకారం... ఈ ఏడాది మన దేశంలో పెళ్లిళ్లకు అయ్యే ఖర్చు దాదాపు రూ.10.85 లక్షల కోట్లు ఉండొచ్చని అంచనా! భారతీయులు ఆహారం, కిరాణ సరుకుల కోసం చేసే వ్యయం తర్వాత పెళ్లిళ్లకు చేసే ఖర్చు రెండో స్థానంలో ఉంది. పిల్లల చదువు కోసం చేసే ఖర్చు కంటే పెళ్లిళ్లకు రెట్టింపు చేస్తున్నారు. భారతీయులు సగటున ఓ పెళ్లికి రూ.12 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఈ నెలలో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. అక్టోబరు-డిసెంబరు మధ్య కాలంలో ఎక్కువగా జరుగుతాయి. దాదాపు 90 శాతం వివాహాలు పెద్దలు కుదిర్చినవే.

ప్రత్యేకతలు

ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌లో ఏటా దాదాపు 80 లక్షల నుంచి కోటి వివాహాలు జరుగుతాయి. అమెరికాతో పోలిస్తే భారత్‌లో వివాహాలకు రెట్టింపు ఖర్చు చేస్తారు. చైనాతో పోలిస్తే మాత్రం భారత్‌లోనే ఖర్చు తక్కువ.

కొత్త ట్రెండ్

సాధారణంగా వధువు సొంతూరులోనో లేదా వధూవరుల కుటుంబాలకు అనుకూలమైన చోట వివాహ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇటీవల కాలంలో వివాహ సంప్రదాయంలో కొత్త ట్రెండ్ మొదలైంది. డబ్బున్నవారు గోవా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, అండమాన్స్ వంటి ప్రాంతాలకు వెళ్లి అంగరంగ వైభవంగా వివాహ వేడుకలు చేసుకుంటున్నారు.

ఉపాధి

పెళ్లిళ్ల వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది. కేటరింగ్, డెకరేషన్, గిఫ్టులు, ఫొటోగ్రాఫర్స్, ఎలక్ట్రానిక్స్ ఆటో మొబైల్స్, పెయింట్స్, ట్రావెల్, ప్లానర్స్ తదితరాలకు భారీగా ఖర్చు చేస్తారు. పెళ్లి బడ్జెట్‌లో ఎక్కువగా బంగారు ఆభరణాలకు ఖర్చు చేస్తారు.

పని ఇప్పిస్తామని పడుపు వృత్తిలోకి..

- యువతుల దుస్థితిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్
- వెంటనే చర్యలకు రాష్ట్రాలు,యూటీలకు నోటీసు
- బిచ్చగాళ్ల రక్షణ, పునరావాసానికి జాతీయ విధానం
- కేంద్రం, రాష్ట్రాలకు హక్కుల కమిషన్ సిఫారసు

న్యూఢిల్లీ, జూలై 7: పని ఇప్పిస్తామని చెప్పి, యువతులను బలవంతంగా పడుపు వృత్తిలోకి దించుతున్న వైనంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. దీనిపై తమకు అందుతున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపింది. నిజనిజాలు నిగ్గు తేల్చాలంటూ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కమిషన్ కోరింది. ఈ మేరకు నోటీసులు జారీచేసింది. రాంచీ (బిహార్), ఝార్ఖండ్‌లో ఈ నెల ఒకటో తేదీన హోటళ్లు, లాడ్జీలపై దాడులు చేసి అరెస్టులు చేసినప్పుడు చాలామంది మహిళలు తమను బలవంతంగా పడుపు వృత్తిలోకి లాగారని తెలిపారని వివరించింది. కొన్ని అసాంఘిక శక్తులు తమకు పని ఇప్పిస్తామని నమ్మించి ఈ సాలెగూడులోకి తెచ్చి పడేశాయని చెప్పినట్టు వార్తలు వస్తున్నాయన్నారు. ఆ వార్తలు నిజమే అయితే, వెంటనే చర్యలు చేపట్టాలని ఆ నోటీసులో కమిషన్ కోరింది. కాగా, బిచ్చగాళ్ల రక్షణ, పునరావాసం కోసం జాతీయ విధానం రూపొందించాలని ప్రభుత్వాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ సిఫారసు చేసింది. దేశవ్యాప్తంగా ఎంతమంది ఇటువంటివారు ఉన్నారనే సమాచారంతో జాతీయ స్థాయిలో డేటాబేస్‌ను ఏర్పాటుచేయాలని కూడా తన ప్రతిపాదనల్లో కోరింది. వీటిపై వీలైనంత త్వరగా జా.తీయ సమగ్ర విధానం అవసరమని అభిప్రాయపడింది. భిక్షం ఎత్తాల్సిన పని లేని పరిస్థితులను సృష్టించేలా, ఆ వృత్తిలోని వారు మెరుగైన జీవితం గడపేలా ప్రణాళికలు తయారుచేయాలని కేంద్రం, రాష్ట్రాలను కోరింది. ఇప్పటికే పలు సంస్కరణలు, పథకాలు, కార్యక్రమాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నా, బిచ్చగాళ్ల సమస్య పెరుగుతుండటం పట్ల కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది.



యూరాలజీ సదస్సులో పాల్గొన్న వైద్యులు

మూత్రనాళాలు సన్నబడుతున్నాయ్

- రోడ్డు ప్రమాదాలు, ఇన్‌ఫెక్షన్లు కారణం
- ఇటీవల పెరిగిన ఈ శస్త్రచికిత్సల సంఖ్య
- యూరాలజీ సదస్సులో వైద్యుల వెల్లడి

హైదరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మూత్రనాళాలు సన్నబడిపోతున్నాయని, దాంతో శస్త్రచికిత్స చేసి సరిచేయాల్సి వస్తోందని, ఈ తరహా ఆపరేషన్లు ఇటీవల కాలంలో బాగా పెరిగాయని వైద్య నిపుణులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్ల వల్ల మూత్రనాళాలు సన్నబడుతున్నాయని వారు వివరించారు. ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో యూరాలజీ సదస్సు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 8 దేశాలతో సహా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 800 మందికి పైగా యూరాలజిస్టులు హాజరయ్యారు. మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సల్లో సరికొత్త ప్రక్రియలపై సదస్సులో చర్చించారు. మూత్రనాళాలు సన్నబడే అవకాశాలు పురుషుల్లో ఎక్కువగా ఉంటాయని, ఇటీవల మహిళలు, పిల్లల్లోనూ ఈ సమస్య కనిపిస్తోందని వైద్యులు తెలిపారు. మూత్రనాళాలు సన్నబడి మూత్రవిసర్జన తగ్గడం, దానివల్ల సమస్యలు వచ్చినప్పుడు శస్త్రచికిత్స అవసరమవుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు, ఇన్ఫెక్షన్ల వల్ల మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు ఎక్కువగా చేయాల్సి వస్తోందన్నారు. యూరాలజిస్టు డాక్టర్ భవతేజ్ ఎన్ గంటి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఫ్రాక్చర్లు అయినప్పుడు మూత్రనాళాలు కూడా దెబ్బతింటాయని, అలాంటప్పుడు కొన్ని నెలలు వేచి ఉండి, తర్వాత సరిచేయాల్సి ఉంటుందన్నారు. ఎక్కువ కాలం పాటు ఆస్పత్రిలో ఉన్నప్పుడు క్యాథటర్స్ అమర్చడం, ఇతర వ్యాధుల వల్ల కూడా మూత్రనాళాలు సన్నబడుతున్నాయన్నారు. ఏఐఎన్‌యూ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో వెయ్యికి పైగా శస్త్రచికిత్సలు చేశామని తెలిపారు. దేశంలో మూత్రనాళ శస్త్రచికిత్సల్లో అగ్రగణ్యులుగా పేరొందిన డాక్టర్ సంజయ్ కులకర్ణి (పుణె), డాక్టర్ గణేష్ గోపాలకృష్ణన్ (కోయంబత్తూరు), ఐఎస్‌బీ హైదరాబాద్ మాజీ డీన్ అజిత్ రంగ్నేకర్ మాట్లాడారు.

పారిశుధ్యలోపంతో అవస్థలు

- ఏ వీధి చూసినా మురుగుమయమే..
- రోడ్లపైనే చెత్తకుప్పలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


గందరగోళం వీధి రోడ్డుపై ఇలా..

(టెక్కలి)

డివిజన్ కేంద్రమైన టెక్కలిలో పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దుర్గంధం వెదజల్లుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 100 వీధులు, 30 వేల మంది జనాభా నివసిస్తున్న టెక్కలికి నిత్యం సమీపంలోని అనేక మండలాలకు చెందిన సుమారు 20 వేల మంది ప్రజలు వివిధ పనులపై రాకపోకలు సాగిస్తుంటారు. సబ్ కలెక్టర్ స్థాయి అధికారి ఉన్నా మేజర్ పంచాయతీలో పారిశుధ్య పనుల్లో క్షేత్రస్థాయిలో ఇటువంటి పరిస్థితి ఉండడంపై సర్వత్రా విమర్శ లొస్తున్నాయి. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు పారి శుధ్య పనులపై ఆగ్రహం వ్యక్తంచేయగా నామ మాత్రంగా పనులు చేప ట్టారు. అయితే ప్రస్తుతం వీధుల్లో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. చెత్తకుప్పలు రోడ్ల పక్క దర్శనమిస్తున్నాయి. కాలువ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం తో నిత్యం ప్రజలు నరకాన్ని అనుభవిస్తున్నారు. అసలే వర్షాకాలం.. ఆపై పారిశుధ్య లోపంతో ఎక్కడ సీజనల్ వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపి స్తోంది. ముఖ్యంగా కంద్రవీధి, గొల్లవీధి, మెట్టవీధి, చిన్న బజారు, కొండ్రవీధి, ఆదీఆంధ్రావీధి, శ్రీనివాస్‌నగర్, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో కాలువలు పూడికలతో నిలిచిపోవడంతో నీరంతా రోడ్లపైనే పారుతోంది. ఏ మాత్రం వర్షం కురిసినా ఇక చెప్పాల్సిన పనిలేదు. ఆదివారం కురిసిన వర్షానికి ఎన్టీఆర్ కాలనీలో దుస్థితి దారుణంగా తయారైంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచా యతీ కార్యదర్శి మల్లేశ్వరరావు వద్ద ప్రస్తావించగా ఉన్న సిబ్బందితో పారిశుధ్య పనులు చేయిస్తామన్నారు. కంద్రవీధి ప్రాంతంలో మురుగు నీరు బయటకు పోయేందుకు కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు.


ఆదివారం కురిసిన వర్షానికి ఎన్టీఆర్ కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు


కంద్రవీధిలో ఇళ్ల ఎదుట ఇలా..

భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టింది వైసీపీనే

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట


మాట్లాడుతున్న కలమట వెంకట రమణ మూర్తి

మెళియాపుట్టి: భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టింది వైసీపీ ప్రభుత్వమేనని, కూటమి ప్రభుత్వం రావడంతో అటువంటి సమస్య లేకుండా చేసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి అన్నారు. ఆదివారం మెళియా పుట్టిలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకురావడంతో కార్మికుల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. గత ఐదేళ్లు ఇసుక దొరకక పేదలు ఎంతో ఇబ్బంది పడ్డారన్నారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం తీసుకు రావడం అభినందనీయమన్నారు. టీడీపీ నాయకులు వసంతరావు, పోలి నాయుడు, పరమేష్ రెడ్డి, జనసేన నాయకులు దుక్క బాలరాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

సీతారాం మృతికి సంతాపం

కొత్తూరు: గులివిందలపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మునికోటి సీతారాం మృతికి మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి సంతాపం తెలిపారు. ఇటీవల మృతి చెందిన సీతారాం స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

టెక్కలిలో అల్లూరి జయంత్యుత్సవం

టెక్కలి: స్థానిక బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వారోత్సవాలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు టి.చందు తదితరులు అల్లూరి సేవలను వివరించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి శ్రావణి, ఎస్ఎఫ్ఐ నాయకులు దుర్గాప్రసాద్, తరుణ్, మాధురి పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

ఎస్టీ మాకివలస భూముల పరిశీలన


గిరిజనులతో మాట్లాడుతున్న ఆర్డీవో రంగయ్య

జలుమూరు: మర్రివలస పంచాయతీ ఎస్టీ మాకివలసకు చెందిన వ్యవసాయ భూములను శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య ఆదివారం పరిశీలించారు. గిరిజనులకు చెందిన భూములను కూర్మ గ్రామానికి చెందిన హరేరామ సంఘం ప్రతినిధులు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని పేర్కొంటూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి తహసీల్దార్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. మాకివలసలో 75 ఎకరాల భూములు ఆ గ్రామానికి చెందిన 52 మంది గిరిజన రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారికి న్యాయం చేయాలని వాబ యోగి కోరారు. దీనిపై ఆర్డీవో రెవెన్యూ రికార్డులు పరిశీలించి ఆ భూములు ఎవరి పేరున ఉన్నాయో పరిశీలించారు. ఎస్.ఎల్.ఆర్ మేరకు ఆ భూములు జిరాయితీ భూములని తెల్పి చెప్పారు. అయితే గిరిజనులకు డీ పట్టాలిచ్చినభూముల సంగతేంటని యోగి ప్రశ్నించగా ఆ భూములు వేరేగా ఉన్నాయని, అవి వారి హక్కులోనే ఉన్నారయని ఆర్డీవో తేల్చిచెప్పారు. ఆ భూములపై గిరిజనులకు ఏమైనా ఆధారాలు ఉంటే సమర్పించాలని ఆర్డీవో రంగయ్య యోగికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ నాగమ్మ, మండల సర్వేయర్ తర్ర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దొంపాక రీచ్‌లో ఇసుక దందా

- వైసీపీ నాయకుల బరితెగింపు
- సమాచారం తెలిసినా స్పందించని అధికారులు
- ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- ఎట్టకేలకు 3 లారీలు సీజ్ చేసిన పోలీసులు

జలుమూరు, జూలై 7: దొంపాక వద్ద వంశధార నదిలో ఇసుక ర్యాంపులో శనివారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలించేందుకు ఇసుకాసురులు ప్రయత్నించారు. ఒక ఎక్స్‌కవేటర్, 5 లారీలతో వైసీపీ నేతలు ఇసుక ర్యాంపులోకి వెళ్లి ఇసుక లోడు చేసేందుకు సిద్ధం కాగా విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు ఎస్ఈబీ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. అయితే అధికారులు స్పందించకపోవడంతో టీడీపీ నేతలు లారీలు వచ్చే మార్గంలో అడ్డంగా ట్రాక్టర్ నిలిపి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. వైసీపీ నేతల అక్రమాలకు అధికారులు కొమ్ము కాస్తున్నారని, దీనికి ఈ ఘటనే ఉదాహరణ అని టీడీపీ నేతలు బగ్గు గోవిందరావు, సాధు ఉమారావు, లండ గోవిందరావు తదితరులు ఆరోపించారు. అధికారుల అండ లేకుంటే ఇసుకను ఎలా తీసుకువెళతారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము అప్రమత్తం అయ్యే సరికే రెండు లారీలు బయటకు ఇసుకతో వెళ్లిపోయాయని వారు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా చేసేదేమీలేక ఘటనా స్థలానికి ఆదివారం తెల్లవారుజామున పోలీసు అధికారులు చేరుకుని మూడు లారీలను సీజ్ పట్టుకున్నారు. దీనిపై ఎస్ఐ మధుసూదనరావు స్పందిస్తూ.. దొంపాక ర్యాంపు నుంచి ఇసుకను అక్రమంగా తరలించేందుకు తీసుకువచ్చిన మూడు లారీలను పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. విజయనగరం బాబా మెట్టకు చెందిన ఓనర్ కం డ్రైవర్లు వేపల సూరిబాబు, లొడగల రాంబాబు, జగదీష్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


సీజ్ చేసిన లారీలు

రేషన్ డిపో ప్రారంభం

వజ్రపుకొత్తూరు: బెండిపంచాయతీ మహాదేవపురంలో ఆదివారం రేషన్ డిపోను ప్రారం భించారు. డిపో డీలరు రాజీనామా చేయడంతో ఎస్‌హెచ్‌జీ గ్రూపునకు డిపోను రెవెన్యూ అధికా రులు అప్పగించారు. గ్రూప్ సభ్యురాలు కూన రూపావతి ఆధ్వర్యంలో రేషన్ డిపోను ప్రారంభించి లబ్ధిదారులకు సరుకులు అందించారు. కార్యక్రమంలో జనసేన పలాస ఇన్‌చార్జ్ వి.దుర్గారావు, టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జి కణితి సురేష్, వార్డు సభ్యులు కంచ రాన గోపాలరావు, కూన షణ్ముఖరావు, శిష్టు సారధినాయుడు, కూన మోహనరావు, తమ్మి నేని భీమారావు, రామారావు ఉన్నారు.


సరుకులు అందిస్తున్న దృశ్యం

రాజధాని అభివృద్ధికి విరాళం

హిరమండలం: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి నిమిత్తం హిరమండలం టీడీపీ నాయకులు లాడె కృష్ణ, అతని మిత్రులు సాయి, వడ్డి సింహాచలం తదితరులు రూ. 50 వేలు విరాళాన్ని అందించారు. ఈ మేరకు ఆదివారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు ఈ మొత్తం అందజేశారు. అలాగే ధనుపురం గ్రామానికి చెందిన నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దారపు డిల్లేశ్వరరావు కూడా రూ.20 వేలను ఎమ్మెల్యేకు అందజేశారు.


ఎమ్మెల్యే ఎంజీఆర్‌కు విరాళం అందిస్తున్న కృష్ణ

పీఏసీఎస్ అభివృద్ధికి రామారావు విశేష సేవలు

నందిగాం: తెంబూరు పీఏసీఎస్ అభివృద్ధికి సీఈవో రామారావు విశేష సేవలు అందించారని వక్తలు అన్నారు. సీఈవోగా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఆసపన్న రామారావు దంపతులను ఆదివారం లట్టిగాంలో సత్కరించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది, డీసీసీబీ బ్యాంక్ ఉద్యోగులు, గ్రామస్థులు ఆయనకు శాలువలు కప్పి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. ఈ సందర్భంగా డీజీఎం ఎం.రమేష్ మాట్లాడుతూ.. తెంబూరు పీఏసీ ఎస్‌కు అనేక అవార్డులు అందించిన ఘనత రామారావుకే దక్కిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కె.బాలకృష్ణారావు, పి.చిరంజీవు, డీసీసీబీ మేనేజర్లు దినమణి, శివప్రసాద్, దామోదర్, రవి, పీఏసీఎస్ అసోసియేషన్ కార్యదర్శి రామారావు, నాయకులు పి.చంద్రశేఖర్, కె.హరిబాబు, పీఏసీఎస్ సీఈవోలు ఎస్.అప్పన్న, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


రామారావు దంపతులను సత్కరిస్తున్న పీఏసీఎస్ అధికారులు, నేతలు

కిడ్నీ ఆసుపత్రిలో శాశ్వత సిబ్బందిని నియమించాలి

పలాస: కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆసుపత్రిలో నెఫ్రాలజిస్టులు, సిబ్బందిని శాశ్వతంగా నియమించి నాణ్యమైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. ఆదివారం ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి భవనాలున్నా పూర్తి స్థాయిలో సేవలు లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 102 ప్రకారం 33 మంది ప్రత్యేక వైద్యాధికారులు, 65 మంది నర్సింగ్ సిబ్బంది, 8 మంది పరిశోధన సిబ్బంది, 18 మంది టెక్నీషియన్లు, 45 మంది ఇతర సిబ్బందిని నియమించాల్సి ఉన్నా వైద్యులు నామమాత్రంగా ఉన్నారని, దీంతో సేవలు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దానం కిడ్నీ వ్యాధుల నియంత్రణకు చిత్తశుద్ధితో పనిచేసి తక్షణం వైద్యాధికారులు, సిబ్బందిని నియమించి పరిశోధనలను ప్రారంభించాలని కోరారు. అంతకు ముందు రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్, ఎన్.గణపతి తదితరులు పాల్గొన్నారు.


వ్యాధిగ్రస్థులతో మాట్లాడుతున్న అజశర్మ

ఓంకార్ మాస్టార్ మృతి తీరనిలోటు

పలాసరూరల్: ఉద్దాన ప్రాంతంలో ప్రజాసమస్యల పోరాటంలో ఓంకార్ మాస్టారు సేవలు మరువలేనివని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ అన్నారు. మాకన్నపల్లి గ్రామంలో సూర్యోదయ యువజన సంఘం, సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓంకార్ డప్పు పట్టి పాటలు పాడి ఉద్యమస్ఫూర్తితో ముందుండేవారని, ఉద్యమాలతోనే సమస్య పరిష్కారానికి కృషి చేసేవారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు లండ బాబూరావు, ఎల్‌వీ.చలం, కుత్తుమ వినోద్, హేమ సూదన్, సీపీఎం నేతలు గోవిందరావు, మద్దిల రామారావు, తెప్పల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి

పోలాకి: కల్లుగీత కార్మికులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం నాయకులు దుబ్బ కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల విజయవాడలో సంఘ సమావేశం నిర్వహించి సమస్యలపై రాష్ట్ర అధ్యక్షుడు వాక రామచంద్రరావు ఆధ్వర్యంలో చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై తీర్మానం చేశారన్నారు. గీత కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, తాటిచెట్టుపై రూ.10 శిస్తును ప్రభుత్వమే చెల్లించాలని, కార్మికుడికి వృత్తి భద్రత, ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు.

స్టేడియాన్ని పరిశీలించిన కలెక్టర్


స్టేడియంను పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్: నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్అండ్‌బీ ఇంజనీర్ జాన్ సుధాకర్‌ను పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏయే క్రీడల శిక్షణకు అవకాశం ఉంది, క్రీడాకారులకు కల్పిస్తున్న సదుపాయాలు, జిమ్, వాష్ రూమ్ తదితరాలను ఎక్కడ కల్పిస్తున్నదీ ఆరా తీశారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, స్టేడియం నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఈఈ రవినాయక్, వాలీబాల్ కోచ్ కె.హరి, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగర ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు గతంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద నాగావళి నదిలో నిర్మించిన డైక్ పనులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. దీని ప్రాధాన్యతను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శిగా రాజేష్

టెక్కలి: బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శిగా టెక్కలికి చెందిన వడుగూరి రాజేష్ ఎన్నికయ్యారు. ఆదివారం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నియోజకవర్గ బ్రాహ్మణ సేవా సంఘం ఎన్నికలు జరిగాయి. రాజేష్ 11వ సారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై ఆ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. బ్రాహ్మణులపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన పైల దాస్‌పై టెక్కలి, కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్లలో బ్రాహ్మణ సంఘ సభ్యులు ఫిర్యాదు చేశారు.

ఐ-కార్ ర్యాంకింగ్‌లో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ నెంబర్-1

- సెంచూరియన్ వర్సిటీ వైస్ చైర్మన్ డీఎన్‌రావు

ఒడిశా

పర్లాకిమిడి: అకడమిక్ ఎక్సలెన్స్ వ్యవసాయ విద్యపై అంకిత భావంతో ఒడిశాలోని సెంచూరియన్ విశ్వ విద్యాలయంలోని డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రి కల్చర్ పని చేస్తోందని విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ డాక్టర్ డీఎస్‌రావు అన్నారు. ఆదివారం విలేక రులతో మాట్లాడుతూ.. స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అద్భుతమైన మైలు రాయిని సాధించి ఐ-కార్ 2024 ర్యాం కింగ్‌లో నెంబర్ వన్ స్థానం సంపాదించిందన్నారు. ఈ విజయం సాధించడం విశ్వ విద్యాలయానికే గర్వకారణమన్నారు. స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ నిబద్ధతతో వినూత్న పరిశోధన, ఆచరణాత్మక శిక్షణ ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తూ విద్యా ర్థులు ఎప్పటికప్పుడు రాణించేలా పాటుపడు తోందని పేర్కొన్నారు.


డాక్టర్ డీఎస్‌రావు

సౌత్‌జోన్ పెన్కాక్ పోటీల్లో ప్రతిభ

గుజరాతీపేట: పాండిచ్చేరిలో ఈ నెల 6, 7వ తేదీల్లో జరిగిన ఐదో సౌత్‌జోన్ పెన్కాక్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. కె.హరీష్, దున్న సుమన, కె.హాసిని, దున్న సుచరిత బంగారు పతకాలు సాధించారు. అలాగే బి.జ్యోతి సాయి ప్రసాద్, బి.ప్రణవి, బి.మిధున్‌లకు రజత పతకాలు, లంక సతీష్, చైతన్య, బి.వెంకటేష్ మేహుల్ కాంస్య పతకాలు సాధించారు. నైపుణ్యం ప్రదర్శించడంపై పెన్కాక్ జిల్లా అధ్యక్షుడు ఆర్.దయామయ, ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మణ్‌నాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు



ప్రమాదకరంగా వంతెన

- టీడీపీ హయాంలో మరమ్మతులు
- ఆ తరువాత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం
- దారి పొడవునా గోతులు
- ఇదీ మహేంద్ర తనయ నదిపై బ్రిడ్జి దుస్థితి

(మెళియాపుట్టి)

ఒడిశా నుంచి ఆంధ్రాకు అనుసంధానంగా 97 ఏళ్ల కిందట పర్లాకిమిడి మహారాజు కృష్ణచంద్ర గజపతిదేవ్ మహేంద్రతనయ నదిపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరు కుంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ వంతెన పాడ వడం, పెద్ద పెద్ద గోతులు తయారై నీరు నిలిచిపోతుండడంతో ఎప్పుడు ఏ ప్రమా దం సంభవిస్తుందో తెలియని పరిస్థితి. 1927లో మెళియాపుట్టిలో తాను నిర్మించిన దేవాలయానికి వచ్చేందుకు వీలుగా మహారాజు ఈ వంతెన నిర్మాణం చేపట్టారు. గతంలో టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూ రు చేసి తుప్పుపట్టిన రెయిలింగ్‌కు మరమ్మతులు చేప ట్టింది. అయితే వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో వంతెనపై గోతులు ఏర్పడి తరచూ ప్రమాదాలు సంభ విస్తున్నాయి. దీంతో నిత్యం ప్రయాణికులు, వాహనచోదకులు నరకాన్ని చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేయించి ప్రమాదాలను నివారించాలని వారు కోరుతున్నారు.

కన్నుల పండువగా..

● సందడిగా జగన్నాథుడి తొలి రథయాత్ర

జిల్లాలో ఆదివారం జగన్నాథస్వామి తొలి రథయాత్ర కన్నుల పండువగా సాగింది. 15 రోజులు నిద్రావస్థలోకి వెళ్లిన స్వామివారు.. నవయవ్వన రూపంలో భక్తులకు దర్శనమించారు. ఆదివారం ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, తులసి మాలలతో ప్రత్యేకంగా పూజలు చేశారు. వివిధ రూపాల్లో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


ఇచ్ఛాపురం: ఆలయం నుంచి రథంపైకి స్వామివారిని తీసుకువస్తూ..


పలాస: జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తజనం


టెక్కలి: జగన్నాథ రథయాత్ర ఊరేగింపు


పొందూరు: స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


ఎల్ఎన్ పేట: స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గోవిందరావు


పలాస రూరల్: తర్లాకోటలో రథంపై జగన్నాథుడు


కంచిలి: మఠం కంచిలిలో రథయాత్ర


జలుమూరు: బైరాగిపేటలో..


మందస: స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


గార: బూరవెల్లిలో స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు


నరసన్నపేట: సత్యవరంలో..


కవిటి: కవిటిలోని బెహరా వీధిలో..


హిరమండలం: రథయాత్రలో పాల్గొన్న భక్తులు


వజ్రపుకొత్తూరు: అనంతగిరి గ్రామంలో ఊరేగింపుగా..

పడవ బోల్తాపడి మత్స్యకారుడు మృతి


జోగారావు (ఫైల్)

సోంపేట: పడవబోల్తాపడి వాడపాలెం గ్రామానికి చెందిన పలిశెట్టి జోగారావు(48) ఆదివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెక్క సింహాచలం, బడే కుమారస్వామి, చెక్క దానయ్య, బుడగట్ల భాస్కర్‌తో కలిసి జోగారావు ఆదివారం వేకువజామున వేటకు బయలుదేరారు. అయితే అలల ఉధృతికి పడవ బోల్తాపడడంతో జాగారావు మృతి చెందారు. జోగారావుకు భార్య పార్వతి, కుమారుడు రాజు, కుమార్తె లక్ష్మి ఉన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. బారువ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డయేరియా లక్షణాలతో వ్యక్తి మృతి


బుజ్జి (ఫైల్)

ఆమదాలవలస: వెదుళ్లవలస గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు బత్తుల లక్ష్మణరావు (బుజ్జి)(47) డయేరియా లక్షణాలతో మృతి చెందాడు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి అహర్నశలు శ్రమించిన వ్యక్తి అకాల మరణం పొందడంపై స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. రెండు రోజులుగా వాంతులు, విరేచనాలతో అనారోగ్యానికి గురైన బుజ్జిని కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం స్వగ్రామమైన వెదుళ్లవలసలో నిర్వహించిన అంత్యక్రియల్లో మండల టీడీపీ అధ్యక్షుడు నూకరాజు, నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, అన్నెపు భాస్కరరావు, నేతింటి జ్యోతి హాజరై మృతదేహంపై టీడీపీ జెండాను ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. కాగా బుజ్జి మృతిపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, సంతాపం తెలియజేశారు.

అప్రమత్తమైన వైద్య సిబ్బంది

ఆమదాలవలస: వెదుళ్లవలస గ్రామంలో డయేరియా లక్షణాలతో ఆదివారం టీడీపీ యువ నాయకులు బత్తుల లక్ష్మణరావు (బుజ్జి) మృతి చెందడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. తొగరాం పీహెచ్‌సీ వైద్యుడు పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామంలోని బావుల్లో క్లోరినేషన్ చేపట్టారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాచి వడకాచిన మంచినీటినే తాగాలని, డయేరియా లక్షణాలు ఎవరికైనా ఉన్నట్టయితే తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో గోపిబాల, ఎంపీడీవో వాసుదేవరావు, ఈవోపీఆర్డీ దుంపల గోవిందరావు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో గ్రూప్-1 అధికారులు


ఆదిత్యుని దర్శించుకున్న గ్రూప్-1 అధికారులు

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని 2023 గ్రూప్-1 అధికారులు పలువురు ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదాన్ని ఆలయ ఈవో చంద్రశేఖర్ అందజేశారు. ధర్మపథంలో భాగంగా ఆలయ అనివెట్టి మండపంలో లావేరు మండలం రౌతుపేటకి చెందిన ఉమా శ్రీ రాజలింగేశ్వర బృందం చే కోలాట ప్రదర్శన నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యేకి వినతి పత్రం అందిస్తున్న గ్రామస్థులు

సోంపేట: మామిడిపల్లి గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు గ్రామస్థులు ఆదివారం వినతి పత్రం అందించారు. చిన మామిడిపల్లి, జక్కరవీధి, శ్మశానవాటికకు రోడ్డు నిర్మించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శిని నియమించాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో టి.వీరాస్వామి, గొరకల రామారావు, దున్న వీరాస్వామి తదితరులు ఉన్నారు.


రణస్థలం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్


ఎచ్చెర్ల: కొంగరాంలో బెందు మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో..

సందడిగా ఎన్ఈఆర్ జన్మదినం

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) జన్మదిన వేడుకలు ఆదివారం సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు అర్చనలు నిర్వహించారు. ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎన్ఈఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా అధికారులు, విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అన్నసమారాధనలో వేలాది మంది అభిమానులు పాల్గొన్నారు. ఎన్ఈఆర్ కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. అదేవిధంగా ఎంఎస్ఎన్ ల్యాబ్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఈ సందర్భంగా నియామక పత్రాలు అందజేశారు. అలాగే ఎన్ఈఆర్ పుట్టిన రోజు సందర్భంగా జేఆర్ పురం పంచాయతీలో పలువురు నిరుపేదలకు మాజీ సర్పంచ్ కొయ్యాన రామలక్ష్మి, నరసయ్య నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

కొంగరాంలో..

ఎచ్చెర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పుట్టిన రోజులు వేడుకలు ఆదివారం కూటమి నేతల ఆధ్వర్యంలో నిర్వహించారు. కొంగరాం గ్రామంలో నిర్వహించిన పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం హయాంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బెందు మల్లేశ్వరరావు, కూటమి నేతలు నక్క లక్ష్మణరావు, బాడాన జనార్దనరావు, విశ్వక్సేన్, గోపిన కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో..

జి.సిగడాం: ఆనందపురంలో బీజేపీ మండల అధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఆదివారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. వృద్ధులకు, దివ్యాంగులకు రొట్టెలు, పండు పంచిపెట్టారు.

మద్దువలస కాలువలోకి దూసుకెళ్లిన ఆటో


కాలువలో పడిపోయిన ఆటో

రేగిడి: మండలంలోని చిన్నలింగాలవలస బస్సు కూడలి సమీపంలో ఉన్న మద్దువలస కుడిప్రధానకాలువలోకి ఆదివారం ఆటో దూసుకువెళ్లింది. దీంతో రణస్థలం మండలంలోని పైడిభీమవరం పంచాయతీ వరిసాం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎన్.సంతోష్‌కుమార్‌కు గాయపడ్డాడు. 108సిబ్బంది కథనం మేరకు.. సంతోష్‌కుమార్ తన ఆటోలో కోళ్ల దాణాను రాజాంనుంచి పాలకొండ వైపు తీసుకువస్తున్నాడు. చిన్న లింగాలవలస సమీపంలో మద్దువలస కుడిప్రధాన కాలువలోకి ఆటో దూసుకు వెళ్లింది. దీంతో ఆటోలో ఉన్న దాణా చెల్లాచెదురుగా పడిపోయింది. డ్రైవర్ సంతోష్ కుమార్ పిచ్చిమొక్కల్లో పడిపోయాడు. అపస్మారకస్థితిలో ఉన్న సంతోష్‌కుమార్‌ను స్థానికులు బయటకు తీసి 108లో రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగాఉంది. దీంతో శ్రీకాకుళం రిఫర్ చేసినట్లు సమాచారం.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం


చెత్తలను తొలగిస్తున్న ఎన్జీవో సభ్యులు

ఇచ్ఛాపురం: పరిసరాలు పరిశుభ్రతతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని స్వేచ్ఛా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ కూన విష్ణుమూర్తి అన్నారు. ఆదివారం ముచ్చింద్ర గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్ ఎస్‌డీజీ గోల్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం గ్రామంలో పేరుకుపోయిన చెత్తను శ్రమదానం చేసి తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సభ్యులు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్, మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ డి.హరిశ్చంద్ర, ఎం.సాయికృష్ణ, విశ్వనాథం, రవికుమార్, సర్పంచ్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు

మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే

అరసవల్లి: శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యునిగా, జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ దంపతులు ఆదివారం నగరంలోని కొత్తపేట అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి గ్రామస్థులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మహిళలు ముగ్గురాటలతో భారీ ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారిని దర్శించుకుని చల్లదనం చేసి ఎమ్మెల్యే దంపతులు మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామస్థులు శంకర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగు గోపాల్, గంగు రమణ, గంగు రాజు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు విస్తృతం చేయాలి



రోటరీ నూతన కార్యవర్గ సభ్యులు, తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: రోటరీ సేవలు మరింత విస్తృతం చేయాలని పూర్వ గవర్నర్ ఎం.రామారావు పాల్గొని మాట్లాడారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రోటరీ క్లబ్ శ్రీకాకుళం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాశ్వత ప్రాజెక్టులు ద్వారా సేవలు విస్తృతం చేయాలన్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు కార్యవర్గ సభ్యులు చే ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. రోటరీ అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా హౌసింగ్ బోర్డు కాలనీలో గల రోటరీ వనంలో మొక్కలు నాటారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం 2024-25 నూతన కార్యవర్గం ఎన్నిక యార్లగడ్డ గీతా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. అధ్యక్షుడిగా ఇంజనీర్ ముని శ్రీనివాసరావు, కార్యదర్శిగా దూసి సంతోష్, ఉపాధ్యక్షులుగా ఎన్.విజయ్ కుమార్, కోశాధికారిగా పసగాడ సూర్యనారాయణ, క్లబ్ లెర్నింగ్ ఫెసిలిటేటర్‌గా దేవరశెట్టి శివశంకర్ సంయుక్త కార్యదర్శిగా ఎస్.కె.గౌరీ శంకర్‌తో పాటు మరికొన్ని శాఖలకు ఇన్‌చార్జీలను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీరందరూ రోటరీ డిస్ట్రిక్ట్-3020 జిల్లా నూతన గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు, సహాయ గవర్నర్ ఊణ్ణ రజినీకాంత్ ఆధ్వర్యంలో సేవలందిచనున్నారు. క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, జేసీస్ లైన్స్ క్లబ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెరవే సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) నెల వారీ సాహితీ సమ్మేళనం ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకటరమణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో 13 మంది కవులు పాల్గొని తమ కవితలు చదివి వినిపించారు.

నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులే


రోడ్డుకి ఇరువైపు నిలిపివేసిన వాహనాలు

ఇచ్ఛాపురం: పట్టణ పరిధి గోర్జివీధిలో నిత్యమూ ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనే ఇరువైపులా వాహనాలు నిలిపి వేయడంతో ప్రజ రాకపోకలకు మరింతగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గోర్జివీధి జంక్షన్‌లో ఒక డిపార్ట్‌మెంటల్ స్టోర్, దానిపైనే ప్రైవేట్ ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. దీంతో డిపార్ట్‌మెంట్ స్టోర్‌కు వచ్చినవారు, ఆసుపత్రికి వచ్చిన రోగులు రోడ్డుమీదే వాహనాలు నిలిపి వేయడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతుంది. వీరికి ఎటువంటి పార్కింగ్ స్థలం లేకపోయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని సర్వత్రా కోరుతున్నారు.

కేంద్రమంత్రిని కలిసిన బీసీ నేత


కేంద్రమంత్రితో మాట్లాడుతున్న రాజేష్

అరసవల్లి: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, జవహర్ లాల్ నెహ్రూ వర్సిటీ సిండికేట్ సభ్యులు డాక్టర్ బుడుమూరు రాజేష్ ఆదివారం భేటీ అయ్యారు. శ్రీకాకుళం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. బీసీల అభ్యున్నతి కోసం, ఉన్నత విద్య, శ్రీకాకుళం యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధికల్పన వంటి విషయాలపై చర్చించారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎచ్చెర్ల: గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని వమరవల్లి ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం రిటైర్డు ప్రిన్సిపాల్ కొత్తకోట అప్పారావు అన్నారు. ఫరీద్‌పేటలో కొత్తకోట రామలక్ష్మి స్మారక గ్రంథాలయాన్ని ఆదివారం యూటీఎఫ్ కౌన్సిలర్ కోరెడ్ల విజయగౌరి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (శ్రీకాకుళం) హెచ్ఎం వాగ్దేవితో పాటు మరికొంత మంది పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొత్తకోట అమ్మినాయుడు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, రాష్ట్ర కౌన్సిలర్లు పొందూరు అప్పారావు, యండ ఉమాశంకర్ తదితరలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే

● యూరియా మాయంపై జేడీ

కవిటి: కంచిలి మండలంలో గతేడాది రైతులకు పంపిణీ చేసిన యూరియా మాయంలో కంచిలి పీఏసీఎస్ నిర్లక్ష్యమే కారణమని వ్యవసాయశాఖ జేడీ కె.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ వ్యవసాయశాఖ సమీక్షలో 20 టన్నుల యూరియా మాయంపై అధికారులు వివరించగా.. ఆదివారం పత్రికల్లో వచ్చిన వార్తలకు జేడీ స్పందించారు. కంచిలి మండలానికి గత ఏడాది 20టన్నుల యూరియాతోపాటు డీఏపీ మార్కుఫెడ్ ద్వారా సరఫరా చేయటం జరిగిందన్నారు. కంచిలి పీఏసీఎస్‌ను ఏవో సందర్శించిన సమయంలో రైతుల పాసుపుస్తకం కాపీ, బిల్లుపై సంతకం తీసుకొని ఈ-పాస్ నమోదు చేయాలని చెప్పారు. ఇవేమీ పట్టించుకోకుండా ఆ పీఏసీఎస్ సిబ్బంది పంపిణీ చేశారన్నారు. ఈ-పాస్ చేయాలని పలుమార్లు చెప్పినా వారు స్పందించకపోవటంతో మార్చి 27న నోటీసు పంపించామన్నారు. ఈ విషయాన్ని జిల్లా కో-ఆపరేటివ్ అధికారికి తెలియజేశామని, నేటికీ ఈ=పాస్ చేయకపోవడంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే అశోక్ సమీక్షలో వివరించడం జరిగిందన్నారు. కంచిలి పీఏసీఎస్ వారిని విచారించి, నివేదిక ఇవ్వనున్నట్టు తెలిపారు.

పేదలకు మేలు

ఆమదాలవలస: ఉచిత ఇసుక విధానంతో పేదలు, కార్మికులకు మేలు కలగనుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోనెల అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇసుక దొరకడం ప్రజలకు గగనమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఉచితంగా ఇసుక అందించడం పేదలకు వరమన్నారు. గత ప్రభుత్వం ట్రాక్టర్ ఇసుక ఐదు వేల రూపాయలకు లారీ ఇసుకను రూ.20 వేలకు అమ్ముకున్నారన్నారు. అటువంటి పరిస్థితులను చంద్రబాబు చరమగీతం పాడారన్నారు. ఉచిత ఇసుక విధానం వల్ల ఇళ్లు నిర్మించుకొనే పేదలు భవన నిర్మాణరంగ కార్మికులు సంతోషంగా ఉన్నారన్నారు.